క్లుప్తంగా

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



పొన్నూరు: యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. విజిలెన్స్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నిడుబ్రోలు జీడీసీఎంఎస్, నిడుబ్రోలు, పెదపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల సరఫరా, అధిక ధరలకు విక్రయాలు, ఇతర జిల్లాలకు తరలింపు అంశాలపై గ్రామస్తులు, రైతులను విచారించారు. తనిఖీలలో విజిలెన్స్ ఏవో సీహెచ్ ఆదినారాయణ, అనిల్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ వంశీకృష్ణ, ఎంపీఈవో ఎస్.సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు. మండలంలోని వల్లభరావుపాలెం, నండూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి ఏవో వెంకటేశ్వరరావు రైతులకు పలు సూచనలు చేశారు.

పెదకాకాని భగీరథుడికి నివాళి



పెదకాకాని: రక్షిత మంచినీటి పథకాన్ని పెదకాకానికి తీసుకువచ్చి గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన భగీరథుడు, మహనీయుడు ఆళ్ళ దశరథరామిరెడ్డి అని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అన్నారు. పెదకాకాని గ్రామంలోని ఎంపీ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి కార్యాలయంలో బుధవారం మాజీ సర్పంచి ఆళ్ళ దశరథరామిరెడ్డి 5వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషి, సేవలను కొనియాడారు. ముందుగా మాజీ సర్పంచి ఆళ్ళ దశరథరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, గోళ్ళ జోసెఫ్, శ్యాంముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, తాడిబోయిన వేణు, కోటు యలమందారెడ్డి, వీర్ల వీరాంజనేయులు, సుంకర నర్సిరెడ్డి, షేక్ నజీర్ అహ్మద్, బాలకృష్ణ, యడ్లపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రత్తిపాడు: రోడ్డు ప్రయాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన కొలసాని శ్రీనివాసరావు (35) బుధవారం రాత్రి గుంటూరు నుంచి అన్నపర్రుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం మర్రి కోల్డ్ స్టోరేజీ సమీపంలో గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కొలసాని శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ నరహరి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయండి

సబ్‌కలెక్టర్ సంజనాసింహ

కొల్లిపర: స్థలాలు, పంట పొలాలు అక్రమంగా ఆక్రమించుకొన్న ఆక్రమణదారులకు అధికారులు నోటీసులు జారీ చేసి, ఆక్రమణలను తొలగించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ తహసీల్దారు జి.సిద్ధార్థకు ఆదేశించారు. మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో పలుచోట్ల స్థలాలు, పంట పొలాలు ఆక్రమణలకు గురైనట్లు గ్రామస్తులు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందజేశారు. దీంతో ఆమె బుధవారం అధికారులతో కలసి పర్యటించి ఆక్రమణలకు గురైన స్థలాలను పరిశీలించి, చుట్టు పక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని దావులూరులో అనధికారంగా ముగ్గురు రైతులకు 19 సెంట్ల భూమి చెముడుబాడులో 5 సెంట్ల భూమి వెబ్‌ల్యాండ్ నమోదు కావటంతో ఆ భూములను కూడా పరిశీలించి వారికి కూడా నోటీసులు జారీ చేయాలని అధికారులకు తెలిపారు. తహసీల్దారు సిద్ధార్థ, డీఎల్‌పీవో స్వరూపరాణి, సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగిన 9 మందిపై కేసు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం తాగిన 9 మందిపై అరండల్‌పేట పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 1వ లైన్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణాల వద్ద మద్యం తాగుతున్న వారిని గుర్తించి పోలీసులు కేసు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగంగా మద్యం తాగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ ఆరోగ్య రాజు హెచ్చరించారు.

అధికారుల అలసత్వం.. ఖజానాకు శాపం

- అద్దె వసూళ్లలో కొనసాగుతున్న మాయాజాలం
- రూ.లక్షల్లో పేరుకుపోయిన మున్సిపల్ దుకాణాల బకాయిలు
- నిబంధనలు పాటించని లీజుదారులు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘానికి చెందిన దుకాణాల అద్దె వసూళ్లలో మాయాజాలం కొనసాగుతోంది. రెవెన్యూ విభాగం అలసత్వం మున్సిపాలిటీ ఖజానాకు శాపంగా పరిణమించింది. నిబంధనల మేరకు బకాయిలు వసూలు చేయక ఏళ్ల తరబడి రూ.లక్షలు పేరుకుపోయినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంటి పన్నులను రాబట్టుకునేందుకు సామాన్య ప్రజల పట్ల కఠినంగా వ్యవహరించే అధికార యంత్రాంగం .. మున్సిపల్ దుకాణాలకు రూ.లక్షల్లో బకాయిలు చెల్లించని వారి పట్ల మెతక వైఖరి ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాల నిర్వహణలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండటంతో సబ్ లీజులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా లేకపోలేదు.

విమర్శల వెల్లువ

- పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో మున్సిపాలిటీకి చెందిన అనురాధ కాంప్లెక్స్‌ను 2022 సంవత్సరం ఏప్రిల్ నుంచి మున్సిపల్ అధికారులు లీజుకు కేటాయించారు. నెలకు సుమారు రూ.79 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. దీంతో పాటు దుకాణాలను సబ్ లీజుకు ఇవ్వకూడదనే మున్సిపల్ నిబంధనలను అనుసరిస్తూ దుకాణాలను నిర్వహించాల్సి ఉంది. అయితే నిర్వాహకులు అందుకు భిన్నంగా వ్యవహరించి దుకాణాలను సబ్ లీజుకు ఇచ్చినట్లు సమాచారం. సబ్ లీజు ద్వారా దుకాణాలను ఇతరులకు కేటాయించి రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలిసింది.
- ఇదిలా ఉండగా గత 12 నెలలుగా అద్దె చెల్లించక సుమారు రూ.14 లక్షల 96 వేలు(జీఎస్టీ, వడ్డీలతో కలిపి) బకాయిలు పేరుకుపోయినట్లు అధికారులు లెక్క తేల్చారు. మూడు నెలల బకాయి ఉంటేనే కఠినంగా వ్యవహరించే మున్సిపల్ అధికారులు.. 12 నెలల నుంచి అద్దె చెల్లించకపోయినా పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి. చిరు వ్యాపారులపై కొరడా ఝుళిపించే అధికారులు, ప్రధాన సెంటర్‌లోని కాంప్లెక్స్‌లో ఇంతటి అక్రమ వ్యవహారం జరుగుతున్నా మౌనం వహించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- మున్సిపాలిటీ ఖజానా ఖాళీ అవుతుండటంతో రోజువారీ నిర్వహణకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాత బకాయిలు, ఆదాయ వనరులపై కమిషనర్ దృష్టి సారించారు. ఐలాండ్ సెంటర్‌లోని అనురాధ కాంప్లెక్స్ దుకాణాలకు సంబంధించి అద్దెల రూపంలో రూ.లక్షలు బకాయిలు ఉన్నట్లుగా లెక్కతేల్చి రికవరీకి కార్యాచరణ రూపొందించారు. కొన్ని దుకాణాలను ఇటీవల సీజ్ చేశారు. అయితే కాంప్లెక్స్‌లోని పై దుకాణాలకు తాళాలు వేసి సబ్ లీజులకు ఇచ్చిన దుకాణాలను వదిలేసిన అధికారుల నామమాత్రపు తీరుపై విమర్శలు వస్తున్నాయి.

బకాయిలు చెల్లించకపోతే తాళాలు వేస్తాం



మున్సిపాలిటీ ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపడుతున్నాం. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాం. నెలల తరబడి అద్దెలు చెల్లించని వారి దుకాణాలకు తాళాలు వేస్తాం. ఇప్పటికే కొన్ని దుకాణాలను సీజ్ చేసి బకాయిలు వసూలు చేశాం. అనురాధ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు సంబంధించి బకాయిలు చెల్లించకపోతే దుకాణాలను సీజ్ చేస్తాం. ఇప్పటికే లీజుదారులకు చెల్లింపుకు ఇచ్చిన గడువు ముగిసింది.

– ముప్పాళ్ల రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యా సంవత్సరం ప్రారంభంలోనే, సాఫ్ట్‌వేర్ సంస్థలతో పాటు, కోర్ ఇంజనీరింగ్ కంపెనీలు తమ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో చెన్నై–తిరుచ్చికి చెందిన ప్రముఖ సంస్థ శ్రీసాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులతో సంస్థ ఏడాదికి రూ.2.5 లక్షల ప్యాకేజీతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కోర్ కోర్సులకు దేశ, విదేశాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని, అందుకు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలే ప్రధాన మార్గం అని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

ప్రత్తిపాడు ఎస్టీ విభాగ అధ్యక్షుడిగా యలమందయ్య

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా కె.యలమందయ్య, చేనేత విభాగం అధ్యక్షులుగా గుత్తికొండ సత్యవతిలను నియమించారు.

నూటా ఎన్నికలకు ఒక ప్యానల్ నుంచే నామినేషన్‌లు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపక సంఘం నూతన అసోసియేషన్ ఏర్పాటుకు సంబంధించి నిర్వహించే నూటా ఎన్నికలకు ఒక ప్యానల్ మాత్రమే నామినేషన్లు దాఖలు చేసినట్టు బుధవారం ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్ తెలిపారు. ఆచార్య పి.బ్రహ్మజీరావు అధ్యక్షుడిగా ఉన్న ప్యానల్ మాత్రమే వారి వారి నామినేషన్ పత్రాలను అందించడం జరిగిందన్నారు. అయితే ఈ ప్యానల్ కాకుండా మరే ప్యానల్ కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. అనంతరం ఎన్నికల వివరాలు వెల్లడిస్తామన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ, లాలుపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో బుల్లా కిషోర్ మాట్లాడుతూ రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, ఆవశ్యకత వాటి వల్ల ఉపయోగాలు వివరించారు. పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పత్తి పంటల్లో రసం పీల్చే పురుగులను గమనించడం జరిగిందని, వాటి నివారణకు వేప నూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు మందులైన డైఫెంథియురాన్ 1.25 గ్రాములు, ప్రొఫెనోఫిస్ 2 మిల్లీ లీటర్లు, అసెటామిప్రిడ్ 0.2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డును తీసుకోవలసిందిగా తెలియజేశారు. జిల్లా వ్యవసాయ సలహా సాంకేతిక బదిలీ కేంద్రం సెంటర్ కో ఆర్డినేటర్ అలజంగి మనోజ్ కుమార్ మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డ్ ప్రకారం ఎరువులను వినియోగించాలని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవ ఎరువులను వినియోగించాలని చెప్పారు. రైతులకు వివిధ పంటల సాగుకు సంభందించిన సందేహాలకు కాల్ సెంటర్ 18004250430 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ ఆనంద్ బాబు, పంచాయతీ సెక్రటరీ, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఎన్‌యులో రూసా భవనానికి శంకుస్థాపన



పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రూసా 2.0 భవనానికి బుధవారం భూమి పూజ చేశారు. ఏఎన్‌యులో రూసా భవన నిర్మాణానికి ఆగష్టు 21వ తేదీన జరగాల్సిన శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడింది. దీంతో ఆ భూమి పూజను వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్నషీలామణిల చేతులమీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ రామచంద్రన్, ప్రొఫెసర్ అశోక్‌కుమార్, ప్రొఫెసర్ ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్, ప్రొఫెసర్ రవి, ప్రొఫెసర్ కృష్ణారావు, ప్రొఫెసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి డిపో అభివృద్ధికి చర్యలు

డీపీటీవో సీహెచ్ విమల



డిపోను పరిశీలిస్తున్న డీపీటీవో విమల, డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ విమల పేర్కొన్నారు. తెనాలి డిపోను బుధవారం ఆమె పరిశీలించారు. ముందుగా గ్యారేజ్‌లో మొక్కలు నాటారు. అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.36 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించేందుకు అవసరమైన అనుమతులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో తెనాలి డిపో అన్ని విషయాలలో ముందు వరుసలో ఉందన్నారు. గ్యారేజ్ విభాగంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా మహిళలకు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. తెనాలి–గుంటూరు నాన్‌స్టాప్ ఏర్పాటుపై మరోసారి సర్వే చేయిస్తామని, ఎక్కువ మంది ప్రయాణికులు కావాలని అడిగితే తప్పని సరిగా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు తక్కెళ్ళపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకాకాని: శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో తక్కెళ్ళపాడు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలియజేశారు. మండలంలోని తక్కెళ్ళపాడు శివాలయం వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను వెంటతీసుకు రావాలన్నారు. వైద్య పరీక్షలు చేసి కంటి సమస్య తీవ్రత ఆధారంగా వైద్య సేవలను సిఫార్స్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటన ద్వారా కోరారు.

రోడ్ల వెంట మొక్కలు నాటించాలి

ఎంపీడీవో విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలోని రోడ్ల వెంట మొక్కలు నాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రధాన రహదారి వెంట కిలోమీటరు పొడవునా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై ఇస్తున్న ఉద్యాన వన పంటలపై అవగాహ కల్పించాలన్నారు. సమావేశంలో ఏవో శ్రీనివాసరెడ్డి, ఏపీడీ శ్రీమన్నారాయణ, ఏపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో యువకుడి మృతి



తూములూరు(కొల్లిపర): జ్వరంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాలు మేరకు మండలంలోని తూములూరు గ్రామంలోని గౌడపాలెం కుచెందిన కొంటి సాయి రాఘవేంద్ర (25) వారం రోజుల క్రిందట తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో కొల్లిపర గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటూ ఉండగా సోమవారం ఒక్క సారిగా ఆరోగ్యం విషమించింది. వెంటనే తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకువెళ్లాలని సిబ్బంది సూచించారు. దీంతో బంధువులు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు పోయాయి. గ్రామంలో చాలా మందికి ఇలాంటి జ్వరాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు, వైద్యులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

సంగంజాగర్లమూడిలో వైభవంగా గణపతి ఉత్సవాలు



గణేష్ మందిరంలో శ్రీరామ గణేష్ యూత్ సభ్యులు

తెనాలి: రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామంలోని రామాలయం సెంటర్లో శ్రీరామ గణేష్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 41వ గణేష్ ఉత్సవాల్లో 8వ రోజైన బుధవారం అన్నదానాన్ని నిర్వహించారు. దాదాపు 5 వేలమంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.అనంతరం లడ్డూ వేలంలో, ఒక భక్తుడు రూ.23 వేలకు దక్కించుకున్నారు. తొమ్మిదో రోజైన గురువారం సాయంత్రం 6 గంటల నుంచి నిమజ్జనం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వీసీ ఆచార్య గంగాధర రావు తదితరులు

పెదకాకాని: పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహ సముదాయంలో అమరావతి హాస్టల్ వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పునరంకితం కావాలని, విద్యార్థుల సామూహిక కృషితోనే సాధ్యమవుతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వసతి గృహాల సముదాయాలలో కల్పించడంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, వర్సిటీ బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లికార్జున, విద్యార్థులు, సిబ్బంది హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో బాలుర వసతి గృహాల అడిషనల్ వార్డెన్లు డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ బాలమురళి, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఎన్.బాబు, ఏఆర్ పార్థసారథి, డాక్టర్ వెంకట శేఖర్, డాక్టర్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దాలి

డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాసరావు తదితరులు

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీలో ప్రతి వార్డునూ స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని గుంటూరు డివిజన్ డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని 10, 11, 12 వార్డులను స్వచ్ఛ వార్డులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బుధవారం ఆయా వార్డుల్లో ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.శివపార్వతితో కలిసి డోర్ టు డోర్ డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఐటీసీ, ఫినిష్ సొసైటీ సహకారంతో ప్రతి ఇంటికీ చెత్తబుట్టలు, పొడి వ్యర్థాల నిర్వహణకు జూట్ బ్యాగులు అందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు కరపత్రాలను అందించాలని సెక్రటరీ షేక్ ఖాజాకు సూచించారు. ప్రతి రోజూ క్లాప్‌మిత్రలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.రమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్‌పర్సన్ డబ్బూరి శ్రీనివాసరావు, ఐటీసీ జిల్లా కో ఆర్డినేటర్ యశ్వంత్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపార సంస్థల పార్కింగ్ నిషేధం

కమిషనర్ పులి శ్రీనివాసలు



అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో ప్రధాన రహదారులు వ్యాపార సంస్థల పార్కింగ్ వినియోగానికి కాదని, ప్రజల వాహనాలు రాకపోకలకు మాత్రమేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసీ కాలేజి రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్ల ఆక్రమణలను, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో హోటల్స్, షాపింగ్ మాల్స్ వంటి సంస్థలు తమ భవన ప్రాంతాల్లోనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని, అలా కాకుండా ట్రాఫిక్‌కి అడ్డుగా రోడ్లను ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణలు లేకుండా గ్రామ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగ ఆక్రమణ నిర్మూలన దళం రోడ్ల ఆక్రమణల తొలగింపుపై మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇప్పటికే శంకర్ విలాస్ వంతెన పనుల వలన నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటే రోడ్ల ఆక్రమణ చేయడం సరికాదన్నారు. జేకేసీ కాలేజ్ రోడ్‌లో పైప్ లైన్ లీకు వర్క్‌ని పరిశీలించి లీకు మరమ్మతులు నాణ్యతగా, వేగంగా చేయాలన్నారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్‌లో పర్యటించి రోడ్ల పక్కన వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని, సెంట్రల్ డివైడర్‌లో పచ్చదనం పెంపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి బుధవారం మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడు లేత గోధుమ రంగు షర్టు, కాఫీ పొడి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తెనాలి జీఆర్పీ పోలీసులు రైల్లో నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని జేబులో సెల్‌ఫోన్ చార్జర్, తాళం చెవి ఉన్నాయి. షర్టు కాలర్‌పై వీనస్ టైలర్స్ లంబాడీపేట విజయవాడ అని లేబుల్ ఉంది. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.వెంకటాద్రిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యాధులు ప్రబలే కాలం



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ యేసుబాబు, డాక్టర్ ప్రియాంక

తెనాలిఅర్బన్: తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు పేర్కొన్నారు. బీసీ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందులపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణీ డాక్టర్ ప్రియాంక, హెచ్‌వీ పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగికి డాక్టరేట్



నెహ్రూనగర్: డీఆర్‌డీఏ లైవ్‌లీ హుడ్ జిల్లా మేనేజర్ తలకాయల అశోక్‌కుమార్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ డాక్టర్ కె.సరళదేవి నేతృత్వంలో సుస్థిర జీవనోపాధుల మీద చేసిన అధ్యాయనానికి గాను డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో అశోక్‌కు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ డాక్టర్ ప్రదానం చేశారు.